

నిమ్మకాయల ధరలు


తెనాలిటౌన్: తెనాలి మార్కెట్ యార్డులో శనివారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.3,000, గరిష్ట ధర రూ.5,800, మోడల్ ధర రూ.4,400 వరకు పలికింది.



వెండి శఠారు బహూకరణ

చేబ్రోలు: పొన్నూరులోని సహస్రలింగేశ్వరస్వామికి తెలంగాణ హైకోర్టు జడ్జి జస్టిస్ పెరుగు శ్రీసుధ కుమారుడు డాక్టర్ జ్యోతిర్విష్ణు భరద్వాజ స్వామికి వెండి శఠారు బహూకరించారు.

కరోనా @ జీరో



గుంటూరు మెడికల్: జిల్లా వ్యాప్తంగా శనివారం కరోనా పాజిటివ్ కేసులు ఒక్కటి కూడా నమోదు కాలేదు. జిల్లాలో ఎక్కడా మరణాలు సంభవించలేదు.

న్యూస్‌రీల్

డీఎస్పీ భాస్కరరావుకు ఏఎస్పీగా ఉద్యోగోన్నతి




విజయభాస్కరరావు



కేవీ మహేష్

నరసరావుపేట: నరసరావుపేట డీఎస్పీగా 2020 నవంబరు 17వ తేదీ నుంచి పనిచేస్తున్న సీహెచ్.విజయభాస్కరరావుకు అదనపు ఎస్పీగా పదోన్నతి లభించింది. బదిలీ అయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం కొంతమంది డీఎస్పీలకు బదిలీలు, మరికొంతమందికి పదోన్నతులు కల్పిస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు భాస్కరరావుకు పదోన్నతి ఇచ్చిన ప్రభుత్వం పోస్టింగ్ ప్రకటించలేదు. ఆయన స్థానంలో వెయిటింగ్‌లో ఉన్న కేవీ మహేష్ నరసరావుపేట డీఎస్పీగా నియమితులయ్యారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 522.00 అడుగుల వద్ద ఉంది. ఇది 152.9470 టీఎంసీలకు సమానంగా ఉంది. సాగర్ జలాశయం నుంచి ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 27,193, ఎస్ఎల్‌బీసీకి 900 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. దీంతో సాగర్ జలాశయం నుంచి మొత్తం ఔట్ ఫ్లోగా 28,095 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్ జలాశయానికి 28,095 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 807.70 అడుగుల వద్ద ఉంది. ఇది 32.9712 టీఎంసీలకు సమానం.

నృసింహుని సేవలో హైకోర్టు న్యాయమూర్తులు



వేదాద్రి(జగ్గయ్యపేట):ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం వేదాద్రిలోని యోగానంద లక్ష్మీ నరసింహస్వామిని ఏపీ, తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తులు శనివారం దర్శించుకున్నారు. ఉదయం ఏపీ హైకోర్టు న్యాయమూర్తి గోపాలకృష్ణ సతీసమేతంగా దర్శించుకున్నారు. వీరికి ఆలయ వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి సుధ దర్శించుకున్నారు. న్యాయమూర్తులకు ఆలయ ఈవో కె.నాగరాజు స్వామివారి చిత్రపటాలు, ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ నాగరాజు, ఎస్సై దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అన్నమయ్య జయంతి ఉత్సవాలు ప్రారంభం

విజయవాడ కల్చరల్: అన్నమయ్య జయంతి సందర్భంగా అన్నమయ్య సంకీర్తన అకాడమీ (శ్వాస), కంచికామకోటి పీఠ శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో వారం రోజుల పాటు నిర్వహించే అన్నమయ్య జయంతి మహోత్సవాలు శనివారం లబ్బీపేట శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో వైభవంగా ప్రారంభమయ్యాయి. అన్నమయ్య కీర్తనలను గాయనీగాయకులు గానం చేశారు. పోవూరి శ్యామ సుందర్, బుర్రా నీలకంఠశాస్త్రి, కస్తూరి గోపాలరావు, జీ అనూరాధ్, వైష్ణవి, మంజుల, వేమూరి విశ్వనాథ్ పాల్గొన్నారు. అన్నమయ్య జయంతి సందర్భంగా సంగీత విద్వాంసులు శోభాయాత్ర చేశారు. పున్నమ్మతోటలోని టీటీడీ కల్యాణ మండపం నుంచి అన్నమయ్య విగ్రహంతో ప్రారంభించి లబ్బీపేట వెంకటేశ్వర స్వామి విగ్రహం వరకు సాగింది.

మెరిసిన తెనాలి 'బంగారం'

- పవర్ లిఫ్టింగ్‌లో షబీనాకు నాలుగు బంగారు పతకాలు
- 'స్ట్రాంగ్ గర్ల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ టైటిల్ సొంతం



స్క్వాట్‌లో బరువులనెత్తుతూ...

తెనాలి: పవర్ లిఫ్టింగ్...బరువులెత్తే ఈ క్రీడలో ఇప్పుడు పేదింటి యువతులు రాణిస్తున్నారు. చదువుతోపాటు బరువులు ఎత్తుతూ జాతీయ, అంతర్జాతీయ వేదికలపై తలపడుతున్నారు. అలవోకగా బంగారు పతకాలు సాధిస్తున్నారు. ఆ క్రీడలో తమ సత్తా చాటుతున్నారు. కేరళలో జరుగుతున్న ఆసియా పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ఏకంగా నాలుగు బంగారు పతకాలు కైవసం చేసుకున్న తెనాలికి చెందిన షేక్ షబీనా అందులో ఒకరు.

పట్టణ అర్‌ఆర్ నగర్‌కు చెందిన ఆటో ఎలక్ట్రీషియన్ మెకానిక్ బుజ్జి, షంషద్‌ల ఏకైక కుమార్తె. గత మార్చిలో ఇంటర్ పూర్తిచేసింది. పదో తరగతిలో ఉండగా పవర్ లిఫ్టింగ్‌కేసి ఆసక్తి చూపిన కుమార్తెను తల్లి ప్రోత్సహించింది.



కామన్‌వెల్త్ పోటీల్లో బంగారు పతకాలు సాధించిన తెనాలి యువతి జి.సాయిరేవతి శిష్యరికంలో కొంతకాలం సాధన చేసింది. రాష్ట్ర పోటీల్లో పాల్గొని ఒకటి రెండు బహుమతులను గెలుచుకున్నాక ఆత్మవిశ్వాసం పెరిగింది. మంగళగిరి కేంద్రంగా నడుస్తున్న ఫిట్‌జోన్ జిమ్ గురించి తెలుసుకుని, అక్కడి కోచ్ ఎం.సంధానిని సంప్రదించారు. అక్కడ్నుంచి సాధన మంగళగిరికి మారింది. స్థానికంగా ఒక ప్రైవేటు విద్యాసంస్థలో టీచరుగా పనిచేస్తున్న షంషద్ కుమార్తె కోసం ఉద్యోగాన్ని వదులుకుంది. కుమార్తెకు తోడుగా సాధనకు తోడ్పడింది. ఇంటర్‌లో కాలేజి తరగతులు అయిపోయి కుమార్తె ఇంటికి రాగానే, రెడీ అయిపోయి మంగళగిరి బస్సెక్కటం, మూడు గంటల సాధన తర్వాత తిరిగి రాత్రి పదిన్నర సమయంలో ఇంటికి చేరుకోవటం దినచర్యగా మారింది. పోటీలు దగ్గరకొస్తుంటే సెలవుల్లోనూ కఠోర సాధన కొనసాగిస్తూ వచ్చారు. అటు చదువు, ఇటు సాధన మినహా షబీనాకు మరో వ్యాపకం లేకుండా పోయింది.

ఇంత కష్టానికి తగిన ఫలితాలను తొలి నుండే అందుకుందా విద్యార్థిని. సబ్‌జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాల్లో తలపడుతూ బహుమతులను కైవసం చేసుకుంటూ వచ్చింది. 2020లో జిల్లాస్థాయి పోటీల్లో ద్వితీయస్థానంతో మొదలుకొని, 2021లో 7వ రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ చాంపియన్‌షిప్‌లో రజతం, 8వ సబ్‌జూనియర్, సీనియర్ చాంపియన్‌షిప్ రెండింటిలోనూ బంగారు పతకం గెలుచుకుంది. రాజస్థాన్‌లో జరిగిన 22వ సబ్‌జూనియర్ జాతీయ చాంపియన్‌షిప్ పోటీల్లో కాంస్య పతకం సాధించింది. 2022లో విశాఖలో జరిగిన సౌతిండియా సబ్‌జూనియర్ పవర్ లిఫ్టింగ్‌లోనూ బంగారు పతకం గెలిచింది. హైదరాబాద్‌లో జరిగిన నేషనల్ ఎక్విప్డ్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో మూడు బంగారు, ఒక రజత పతకాన్ని సాధించింది. 2022-23లో విశాఖలో జరిగిన 9వ ఏపీ స్టేట్ సీనియర్ క్లాసిక్ పవర్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో ప్రథమ బహుమతితో 'స్ట్రాంగ్ గర్ల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ టైటిల్‌ను గెలిచింది.

తాజాగా కేరళలోని అలప్పుజాలో జరుగుతున్న ఆసియా పవర్ లిఫ్టింగ్ పోటీల్లో 84 కిలోల కేటగిరీలో తలపడిన షబీనా స్క్వాట్‌లో 172.5 కిలోల బరువునెత్తింది. బెంచ్ ప్రెస్‌లో 75 కిలోలు, డెడ్ లిఫ్ట్‌లో 160 కిలోలు ఎత్తి, ఆ మూడింటిలో బంగారు పతకాలతోపాటు ఓవరాల్‌గా 407.5 కిలోల బరువులతో మరో బంగారు పతకాన్ని తన ఖాతాలో వేసుకుంది. శుక్రవారం జరిగిన ఈ పోటీల్లో మొత్తం నాలుగు బంగారు పతకాలతో విజయహాసం చేసింది. కామన్‌వెల్త్, ప్రపంచ చాంపియన్‌షిప్ పోటీల్లో పతకాలు నెగ్గి, రైల్వేలో ఉద్యోగం సాధించాలనేది తన లక్ష్యంగా చెప్పింది షబీనా.

స్పాన్సర్ తోడుంటే మరిన్ని అద్భుతాలు



షబీనా పట్టుదల చూసి ఉచితంగానే ఆమెకు శిక్షణ నిస్తున్నాను. తగిన పోషకాహారం, ఎక్విప్‌మెంట్, ఇతర ఖర్చులు భరించలేని పేద కుటుంబం తనది. అండగా ఉండే స్పాన్సర్ దొరికితే షబీనా ఇంకా అద్భుతాలను సాధిస్తుంది.

– షేక్ సంధాని, కోచ్

జిల్లాలో బాలికలదే హవా

- పదిలో 69.47శాతం ఉత్తీర్ణత
- గత ఏడాది కంటే ఆరు శాతం పెరుగుదల
- గురుకుల పాఠశాల ఉత్తీర్ణత 94.83శాతం

నరసరావుపేటఈస్ట్: పదవ తరగతి పరీక్ష ఫలితాలలో పల్నాడు జిల్లా బాలికలు సత్తా చాటారు. జిల్లా 69.47శాతం ఉత్తీర్ణత సాధించింది. బాలికలు 73.75శాతం ఉత్తీర్ణత సాధించి దుమ్ము రేపారు. బాలురు 65.43శాతం ఉత్తీర్ణులయ్యారు. జిల్లాలో 433 ఉన్నత పాఠశాలల నుంచి 24,174మంది విద్యార్థులు పది పరీక్షలకు హాజర్వగా 16,793 మంది ఉత్తీర్ణులయ్యారు. వీరిలో 12,443 మంది బాలురకుగాను 8,141మంది, 11,731మంది బాలికలకుగాను 8,652 మంది ఉత్తీర్ణులయ్యారు. వీరిలో 12,916మంది ప్రథమ, 2,748మంది ద్వితీయ, 1,229మంది తృతీయ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు. జిల్లాలో ఎయిడెడ్ పాఠశాలల నుంచి 823 మంది విద్యార్థులకుగాను 516 మంది, మోడల్ స్కూల్స్ నుంచి 1152 మందికిగాను 831, గురుకుల పాఠశాలల నుంచి 58 మందికిగాను 55 మంది, సాంఘిక సంక్షేమ పాఠశాలల నుంచి 779 మందికిగాను 508 మంది, గిరిజన గురుకుల సంక్షేమ పాఠశాలల నుంచి 335 మందికి 208, బీసీ సంక్షేమ పాఠశాలల నుంచి 107 మందికి 80, ప్రభుత్వ పాఠశాలల నుంచి 269 మందికి 112, కస్తూర్బా పాఠశాలల నుంచి 799 మందికి 438, మున్సిపల్ పాఠశాలల నుంచి 522 మందికి 336, గిరిజన పాఠశాలల నుంచి 68మందికి 32, జెడ్పీ హైస్కూల్స్ నుంచి 10,976 మందికి 6,301మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ప్రైవేటు పాఠశాలల నుంచి 8,466 మందికి గాను 7,376 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు.

ఉత్తీర్ణత శాతం పెరిగింది : డీఈఓ శామ్యూల్

పదో తరగతి పరీక్షా ఫలితాలలో పల్నాడు జిల్లా 69.43 శాతం ఉత్తీర్ణత సాధించటం పట్ల జిల్లా విద్యాశాఖాధికారి కె.శామ్యూల్ హర్షం వ్యక్తం చేశారు. గతేడాది కంటే ఉత్తీర్ణత ఆరు శాతం పెరిగిందని తెలిపారు. ఈ ఏడాది బాలికల ఉత్తీర్ణత శాతం గణనీయంగా పెరిగిందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులతో జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ ప్రత్యేకంగా సమావేశమై వారికి దిశానిర్దేశం చేస్తారని తెలిపారు. జూన్ 2వ తేదీ నుంచి సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభమవుతున్న దృష్ట్యా ఫెయిల్ అయిన విద్యార్థులకు ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు రెమిడియల్ కోచింగ్ అందిస్తారని స్పష్టం చేశారు.

వీడని వర్షం

- నేలవాలుతున్న మొక్కజొన్న, జొన్న
- నీటిలో నానుతున్న పంటలు
- దిక్కుతోచని స్థితిలో రైతులు

కొరిటెపాడు(గుంటూరు): జిల్లాను వర్షం వీడడం లేదు. రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కోతలు పూర్తికాని మొక్కజొన్న, జొన్న చేలు ఈదురు గాలులు, భారీ వర్షానికి నేలవాలుతున్నాయి. ప్రస్తుత రబీ సీజన్‌లో జిల్లాలో దుగ్గిరాల, తెనాలి, చేబ్రోలు, కొల్లిపర, కాకుమాను, ప్రత్తిపాడు, పొన్నూరు, వట్టిచెరుకూరు తదితర మండలాల్లో 25,984 హెక్టార్లలో మొక్కజొన్న, 9,078 హెక్టార్లలో జొన్న సాగు చేశారు. వీటిలో సుమారు 55 శాతం పంట కోతలు పూర్తయ్యాయి. పలుచోట్ల పంట నూర్పిళ్లు చేస్తుండగా అకాల వర్షాలతో కల్లాల్లోని మొక్కజొన్న, జొన్న తడిచిపోవడంతో రైతులకు దిక్కుతోచని పరిస్థితి ఏర్పడింది.

ఎండ.. వాన దోబూచులాట...

వాతావరణంలో మార్పులు కారణంగా కొద్దిసేపు ఎండరావడంతో నూర్పిడి చేసిన మొక్కజొన్న, జొన్నలను రైతులు గట్టుకు చేర్చి ఎండబెట్టే ప్రయత్నం చేస్తున్నారు. కొద్దిసేపటికే ఒక్కసారిగా వర్షం పడడంతో ఎండబెట్టిన మొక్కజొన్న, జొన్న పంటను తడవకుండా జాగ్రత్తలు తీసుకోవడానికి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒకచోట వర్షం పడుతుంటే మరొక చోట భారీ వర్షం కురుస్తోంది.

కొల్లిపరలో 37.6 మిలీమీటర్ల వర్షం..


గుంటూరు జిల్లాలో శుక్రవారం ఉదయం నుంచి శనివారం ఉదయం వరకు అత్యధికంగా కొల్లిపర మండలంలో 37.6 మిల్లీ మీటర్లు వర్షం పడగా, అత్యల్పంగా దుగ్గిరాల మండలంలో 0.8 మి.మీ. వర్షం పడింది. సగటున 11.4 మి.మీ. వర్షపాతం నమోదైంది. వట్టిచెరుకూరు 29.8, తాడికొండ 24.2, ఫిరంగిపురం 22.8, కాకుమాను 20.2, తుళ్లూరు 16.2, గుంటూరు తూర్పు 10, మేడికొండూరు 9.4, పెదకాకాని 8.2, గుంటూరు పశ్చిమ 7.8, తాడేపల్లి 7.6, పొన్నూరు 5.4, తెనాలి 3.8, చేబ్రోలు మండలంలో 2.2 మి.మీ చొప్పున వర్షం పడింది.

కాయకుళ్లును నివారించాలి

ప్రత్తిపాడు: మిరపలో కాయకుళ్లును నియంత్రించేందుకు రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని గుంటూరు జిల్లా ఉద్యానశాఖాధికారి ఎస్ సుజాత అన్నారు. వట్టిచెరుకూరు మండలం అనంతవరప్పాడులో శనివారం ఆమె లాం ఫాం శాస్త్రవేత్తలతో కలిసి పర్యటించారు. శాస్త్రవేత్తలు డాక్టర్ కె గిరిధర్, డాక్టర్ నాగలక్ష్మిలు మిర్చి పొలాలను, కల్లాల్లో ఆరబోసిన మిరప దిగుబడులను పరిశీలించారు. కాయకుళ్లు నివారణకు డైఫెల్‌కొనజోల్ ఒక మి.లీ లేదా క్లోరోథలోనిల్ రెండు గ్రాములు లేదా థయోఫినైట్ మిథైల్ రెండు గ్రాములు లేదా మాంకో జెబ్, కార్బండైజమ్ 2.5 గ్రాములు ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు.

అవగాహనతో థలసీమియాకు చెక్

- రేపు ప్రపంచ థలసీమియా దినోత్సవం
- వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కల్గి ఉండాలి
- బాధితులకు ప్రభుత్వం రూ.10వేలు సాయం



గుంటూరుమెడికల్: థలసీమియా వ్యాధి సోకితే ప్రాణాలపై ఆశలు వదులుకోవటమే. మన దేశంలో 3.7 కోట్ల మందికి పైగా బాధితులు ఉన్నారు. తలసీమియా వ్యాధికి గురైన చిన్నారికి జీవితాంతం రక్తం ఎక్కిస్తూనే ఉండాలి. ఏ క్షణానైనా రక్తం ఎక్కించడం ఆపివేస్తే కొద్దిరోజుల్లోనే పిల్లవాడు చనిపోతాడు. వ్యాధిపై అవగాహన కలిగి ఉండటం ద్వారా పుట్టబోయే పిల్లలు వ్యాధి బారిన పడకుండా కాపాడవచ్చు. ప్రజలకు అవగాహన కల్పించేందుకు సోమవారం ప్రపంచ థలసీమియా దినోత్సవం నిర్వహిస్తున్నారు. 'సాక్షి'అందిస్తున్న ప్రత్యేక కథనం.

జిల్లాలో 42 మంది బాధితులు

థలసీమియాతో ప్రతి ఏడాదీ వేలాదిమంది పిల్లలు జన్మిస్తున్నట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. గుంటూరు జిల్లాలో ప్రతినెలా ఏడుగురు చిన్నారులు థలసీమియా వ్యాధి సోకి చికిత్స కోసం జీజీహెచ్‌కు వస్తున్నట్లు వైద్య నిపుణులు తెలిపారు. ప్రస్తుతం గుంటూరు జీజీహెచ్‌లో 40 మంది చిన్నారులు చికిత్స పొందుతున్నారు. చిన్నపిల్లల వైద్య విభాగంలో ప్రతిరోజూ బాధితులకు ఉచితంగా వైద్యం అందిస్తున్నారు. బాధితులకు క్రమం తప్పకుండా రక్తం కూడా ఉచితంగా ఎక్కిస్తున్నారు. ప్రతి శుక్రవారం ప్రత్యేకంగా థలసీమియా బాధితులకు పిల్లల వైద్య విభాగంలో ఓపీ వైద్య సేవలు అందిస్తున్నారు.

వ్యాధిరావడానికి కారణాలు

థలసీమియా వ్యాధి జన్యుపరమైనది. ఎముక మూలుగలో హిమోగ్లోబిన్ ఉండే రక్తకణాల ఉత్పత్తి నిలిచిపోవటాన్ని థలసీమియా వ్యాధి అంటారు. ఇది తల్లిదండ్రుల ద్వారా పిల్లలకు సోకుతుంది. థలసీమియా సోకిన వారికి జీవితాంతం రక్తం ఎక్కించాల్సి ఉంటుంది. మనం పీల్చే ప్రాణవాయువు(ఆక్సిజన్)ను రక్తం ద్వారా శరీరంలోని అన్ని భాగాలకు అందించేది హిమోగ్లోబినే. తలసీమియా రోగుల్లో శరీరానికి సరిపడ హిమోగ్లోబిన్ ఉత్పత్తి కాదు. ఒక వేళ తయారైనా ఎక్కువ కాలం హిమోగ్లోబిన్ ఉండదు. హిమోగ్లోబిన్ నిల్వలు తగ్గిన ప్రతిసారి కృత్రిమంగా రక్తం ద్వారా హిమోగ్లోబిన్‌ను అందించాలి. సకాలంలో అందించకపోతే ప్రాణాలు పోతాయి.

వ్యాధి లక్షణాలు

పుట్టిన బిడ్డ మూడు నెలల వయస్సు నుంచి 18 నెలల వయస్సులోపే ఈ వ్యాధి బయట పడుతుంది. ముఖం పీక్కుపోవటం, బాల్యంలోనే ముడతలు పడినట్టుగా తయారవుతుంది. శరీర రంగు తేడాగా ఉండి పాలిపోయినట్టుగా మారుతుంది. శారీరక ఎదుగుదల ఉండదు. బొడ్డు భాగంలో వాపు ఉంటుంది. తరచూ అనారోగ్యానికి గురవుతారు. బాధితుల్లో అడుగేస్తే ఆయాసం, తీవ్రస్థాయిలో నీరసం, జీర్ణశక్తి మందగించడం, పొట్ట లావు ఎక్కడం, ఎముకల్లో పటుత్వం తగ్గడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఐరన్ తక్కువగా ఉండాలి. కానీ శరీరంలోకి రక్తం ఎక్కించే సమయంలో ప్రవేశించే ఐరన్ ఓకేచోట కుప్పలాగా పోగుబడి మూత్ర పిండాలు, కాలేయం, గుండె సమస్యలు తలెత్తుతాయి.

బాధితులకు రూ.10వేలు ఆర్థిక సాయం

డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా పనిచేసిన సమయంలో థలసీమియా వ్యాధిని ఆరోగ్యశ్రీ పథకంలో చేర్చారు. ఆయన తనయుడు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి థలసీమియా బాధితుల సమస్యలను నివారించేందుకు వారికి కొండంత అండగా నిలబడ్డారు. ప్రతినెలా బాధితులకు రూ.10వేలు ఆర్థిక సాయం పెన్షన్ రూపంలో అందిస్తున్నారు. బాధితులకు అవసరమయ్యే వైద్య సేవలన్నీ డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ప్రభుత్వం ఉచితంగా అందిస్తోంది. గుంటూరు జీజీహెచ్‌లో ప్రతి శుక్రవారం థలసీమియా బాధితులకు ప్రత్యేక ఓపీ విభాగాన్ని ఏర్పాటుచేసి ఉచితంగా మందులు అందిస్తున్నారు.

ఉచితంగా వైద్య సేవలు



జిల్లా వ్యాప్తంగా ఉన్న థలసీమియా బాధితులకు ప్రభుత్వం అండగా ఉండి, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా వైద్య సేవలు అందించడంతోపాటు మందులు కూడా అందిస్తోంది. జిల్లా వ్యాప్తంగా 142 మంది తలసీమియా బాధితులు ఉండగా, వీరిలో 83 మంది బాలురు, 59 మంది బాలికలు ఉన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి థలసీమియా చిన్నారులకు రూ.10వేలు పెన్షన్ అందించి వారికి ఆరోగ్యపరంగా పూర్తి భరోసా కల్పిస్తున్నారు. గుంటూరు జీజీహెచ్‌లోని డైక్ సెంటర్ ద్వారా థలసీమియా బాధితులకు కావాల్సిన అన్ని వైద్య సేవలను అందిస్తున్నాం.

– డీఎంహెచ్‌ఓ డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు

ముందస్తుగా గుర్తించవచ్చు....



గుంటూరు జీజీహెచ్‌లో థలసీమియా వ్యాధి బాధితులకు ఉచితంగా ప్రతిరోజూ వైద్య సేవలందిస్తున్నాం. వ్యాధిని పసిగుడ్డు గర్భంలో ఉన్న సమయంలో వ్యాధి నిర్ధారణ చేసి గుర్తించవచ్చు. పెళ్లికి ముందే వధూవరులకు కంప్లీట్ బ్లడ్ కౌంట్ సీబీసీ, హెచ్‌బీఏ 2 లెవల్ పరీక్షలు చేయించాలి. థలసీమియా వ్యాధి కుటుంబాలకు జన్యుపరమైన పరీక్షలు చేయాలి. వ్యాధి పట్ల ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించడం ద్వారా వ్యాధి బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకునే అవకాశం కలుగుతుంది.

– డాక్టర్ పి.పద్మలత, పిల్లల వైద్య విభాగాధిపతి, గుంటూరు జీజీహెచ్

పేదలందరికీ ఇళ్లు వేగవంతం చేయండి

కలెక్టర్ ఎల్.శివశంకర్



ఇక్కుర్రు అర్బన్ లే అవుట్‌ను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి

నరసరావుపేటరూరల్: జగనన్న పేదలందరికీ ఇళ్లు కార్యక్రమం పనుల్లో వేగాన్ని పెంచాలని జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి తెలిపారు. మండలంలోని ఇక్కుర్రు అర్బన్ హౌసింగ్ లే అవుట్‌ను శనివారం ఆయన పరిశీలించారు. జగనన్న కాలనీలో జరుగుతున్న నిర్మాణ పనులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. కాలనీలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అప్రోచ్ రోడ్ల నిర్మాణం వెంటనే చేపట్టాలని, గృహ నిర్మాణాలకు అవసరమైన నీటిని సరఫరా చేసేందుకు బోర్లు వేసేందుకు అంచనాలు తయారుచేయాలని ఆదేశించారు. కాలనీలో విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. గృహ నిర్మాణాలకు సంబంధించిన పనులు వేగం పెంచాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారి వేణుగోపాలరావు, జెడ్పీటీసీ సభ్యుడు పదముత్తం చిట్టిబాబు, గ్రామ ప్రజాప్రతినిధులు, మండల అధికారులు పాల్గొన్నారు.

2027 నాటికి ప్రకృతి వ్యవసాయ గ్రామాలే లక్ష్యం

రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ విజయ్‌కుమార్



మాట్లాడుతున్న విజయ్‌కుమార్

కొరిటెపాడు(గుంటూరు): రాబోయే ఏడు నుంచి ఎనిమిది సంవత్సరాలలో రాష్ట్రంలో 10 వేల మంది రైతు శాస్త్రవేత్తలు ఐజీజీఏఏఆర్ఎల్ అకాడమీ ద్వారా తయారవుతారని రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ విజయ్‌కుమార్ స్పష్టం చేశారు. ప్రతి మెంటార్ కూడా శాస్త్రవేత్తగా మారి సొంత పొలంలో మొదట ప్రయోగాలు చేయాలని తెలిపారు. ఆ అనుభవంతో తమ గ్రామంలో ఉన్న రైతు శాస్త్రవేత్తలతో కలసి 2027 సంవత్సరం నాటికి 'ప్రకృతి వ్యవసాయ గ్రామంగా' మార్చాలనే సంకల్పంతో ముందుకు వెళ్లాలని సూచించారు. రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో మెంటార్లకు నిర్వహిస్తున్న ఏడు రోజుల శిక్షణ ముగింపు కార్యక్రమంలో భాగంగా గుంటూరులోని రెవెన్యూ కల్యాణ మండపంలో శనివారం ఆయన మాట్లాడారు. వాస్తవానికి ప్రతి రైతు కూడా శాస్త్రవేత్త అని, రైతు తీసుకునే రిస్క్ ఏ శాస్త్రవేత్త తీసుకోరని పేర్కొన్నారు. వచ్చే జూలై నాటికి మెంటార్ల పొలాలు మోడల్‌గా తయారు కావాలని చెప్పారు. రాబోయే 8-9 సంవత్సరాలలో ప్రతి రైతు భరోసా కేంద్రానికి ఒక రైతు శాస్త్రవేత్తగా తయారవుతారన్నారు. మనమంతా ఎంతో ప్రమాదకరంలో ఉన్నామని, భూమి ఆరోగ్యంగా ఉంటేనే మానవ జాతి మనుగడ సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ప్రకృతి వ్యవసాయంతోనే భూమి పరిరక్షణ సాధ్యమని తెలిపారు. ప్రస్తుత వ్యవసాయ విధానంలో సమూల మార్పులు చోటుచేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని అభిప్రాయపడ్డారు. రైతు సాధికార సంస్థ సలహాదారుడు జి.మురళీధర్ మాట్లాడుతూ ప్రతి నెలా వివిధ దశల్లో శిక్షణ తరగతులు ఉంటాయని, అందరూ విధిగా హాజరుకావాలని సూచించారు. రైతు సాధికార సంస్థ థిమాటిక్ లీడ్‌లు జాకీర్ హుస్సేన్, జాన్ ధర్మేందర్, చక్రవర్తి, రాము, సత్యసాయి, అరుణ, రాష్ట్ర టీం సభ్యులు పాల్గొన్నారు.

కనుల పండువగా గ్రామోత్సవం



గ్రామోత్సవాన్ని ప్రారంభిస్తున్న యెనుముల



స్వామి వారి ఉత్సవ విగ్రహాలు

గురజాల: నగర పంచాయతీ పరిధిలోని జంగమహేశ్వరపురంలో నూతనంగా నిర్మించిన చేసిన భూ సమేత నరసింహ స్వామి దేవాలయం వార్షికోత్సవాలు శనివారం ముగిశాయి. గత నెల 30వ తేదీ నుంచి వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శనివారం ఉదయం సుప్రభాతం, మంగళవాయిద్యా ఘోష్టి, సాయంత్రం సమయంలో స్వామి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా వాహనంపై అలంకరించి విశేష ఆలంకరణలతో మరియు వాయిద్యాలతో నరసింహ స్వామిని గ్రామ పురవీదుల్లో అంగరంగ వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామోత్సవం కనుల పండువగా జరిగింది. తొలుత స్వామి వారి గ్రామోత్సవ వేడుకలను నగర పంచాయతీ చైర్‌పర్సన్ పోలు పవన్మయి వీరారెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి యెనుముల మురళీధర్‌రెడ్డి స్వామి వారి రథం వద్ద పూజలు చేశారు. మహిళలు స్వామి వారికి నీటితో వారు పోసి స్వాగతం పలికారు. దేవాలయాన్ని కట్టుబడి చేసిన మేస్త్రీలను, దేవాలయ కట్టుబడిలో పాల్గొన్న ప్రతి ఒక్కరిని సత్కరించారు. అనంతరం ఏకాంతసేవ, పవళింపు సేవ నిర్వహించారు. నేటితో స్వామి ఉత్సవాలు కన్నుల పండువగా ముగిశాయి. పూజా కార్యక్రమాలను అర్చకులు కారెంపూడి వేణుగోపాలచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించారు.

చౌడేశ్వరి అమ్మవారి సన్నిధిలో ప్రభుత్వ విప్ పీఆర్కే



చౌడేశ్వరి అమ్మవారి దేవస్థానంలో ప్రత్యేక పూజలలో పాల్గొన్న ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

రెంటచింతల: స్థానిక చౌడేశ్వరి అమ్మవారిని ప్రభుత్వ విప్, పల్నాడు జిల్లా అధ్యక్షులు పిన్నెల్లి రామకృష్ణా రెడ్డి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. జ్యోతుల మహోత్సవంలో నిర్వహించారు. దేవ స్థానం ప్రధాన అర్చకులు అనీల్ నేతృత్వంలో ఎంపీపీ దాసరి చౌడేశ్వరి, రెంటచింతల సర్పంచి పూజల పుష్పావతి రామయ్య సతీసమేతంగా ప్రభుత్వ విప్ పీఆర్కేకు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ పీఆర్కే మాట్లాడుతూ కోరిన కోరికలు తీర్చే మహాకల్ప వల్లి చౌడేశ్వరి అమ్మవారి చల్లని దీవెనలు గ్రామ ప్రజలకు అందచేసి ఆయురారోగ్యాలు, సకల సంతోషాలు కలుగచేయాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం పీఆర్కేను దేవస్థానం పెద్దశెట్టి పల్లా నరసింహారావు, ఎంపీపీ, సర్పంచి దంపతులు ఘనంగా సన్మానించారు. ఆయన వెంట వైస్ ఎంపీపీ ఏరువ శౌర్రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నవులూరి భాస్కర్‌రెడ్డి, సత్రశాల దేవస్థానం చైర్మన్ బొద్దూరి బ్రహ్మారెడ్డి, పార్టీ నాయకులు మోర్తల ఉమ, గొట్టం బ్రహ్మారెడ్డి, తుమ్మా ఇన్నారెడ్డి, బోయపాటి మరియదాసిరెడ్డి, ఏరువ ప్రతాప్‌రెడ్డి, కట్టమూరి శ్రీనివాసరావు, గొట్టం భాస్కర్‌రెడ్డి, బి.తిరుపతిరావు, ఏలూరి సత్యం పాల్గొన్నారు.

చోరీ కేసుల్లో నిందితుడి అరెస్టు

గుంటూరు రూరల్: చోరీ కేసుల్లో నిందితుడిని అరెస్ట్ చేసి, అతడి వద్ద నుంచి రూ.6 లక్షల సొత్తు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ మహబూబ్‌బాషా తెలిపారు. నగరంలోని సౌత్ డీఎస్పీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. నెల్లూరు జిల్లా, ఆత్మకూరు మండలం ఎస్ఆర్ పల్లెకు చెందిన రాగి మారుతీరావు గత కొంతకాలంగా గుంటూరు రూరల్ మండలం పరిధిలోని గోరంట్ల హనుమాన్‌నగర్ 2వ లైనులో నివాసముంటున్నాడు. చెడు వ్యసనాలకు బానిసై డబ్బుకోసం గత నెల 3వ తేదీన బృందావన్ గార్డెన్స్ సమీపంలోని చౌదరి మెడికల్ షాపు ముందు ఉన్న సుజుకి యాక్సెస్ ద్విచక్ర వాహనాన్ని, 8న తిరుమలనగర్లో హోండా యాక్టివా వాహనాన్ని, అదే ప్రాంతంలోని ఒకటో లైనులో ఓ ఇంటిలో ఎవ్వరూ లేని సమయాన్ని గమనించి ఆ ఇంటి తాళాలు పగలగొట్టి మొదటి బెడ్ రూమ్‌లో బంగారం, వెండి ఆభరణాలు చోరీ చేసినట్లు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన నల్లపాడు పోలీస్ స్టేషన్ పోలీసులు వివరాలను సేకరించి అమరావతి రోడ్డు హోసన్నా మందిరం సమీపంలో ద్విచక్ర వాహనంపై వస్తున్న నిందితుడిని సీఐ శ్రీనివాసరావు అదుపులోకి తీసుకున్నారని తెలిపారు. నిందితుడిని తమదైన స్టైల్‌లో విచారించగా నిందితుడు తాను చేసిన చోరీలను ఒప్పుకున్నాడన్నారు. నిందితుడి వద్ద నుంచి 75 గ్రాముల బంగారం వస్తువులు, సుమారు 250 గ్రాముల వెండి వస్తువులు, లక్షా రెండు వేల నగదు, రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ సుమారు రూ.6 లక్షలు ఉంటుందని తెలిపారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండుకు పంపినట్లు డీఎస్పీ పేర్కొన్నారు. కేసును ఛేదించి నిందితుడిని అరెస్ట్ చేసిన నల్లపాడు సీఐ బత్తుల శ్రీనివాసరావు, ఎస్ఐ డి.అశోక్, హెడ్ కానిస్టేబుల్ కాకుమాను సుబ్బారావు, కానిస్టేబుళ్లు షేక్ జాన్ సైదా, డి.పోతురాజు, కే వెంకట నారాయణలను అర్బన్ ఎస్పీ ప్రత్యేకంగా అభినందించినట్లు వివరించారు.

ముమ్మరంగా పేదల ఇళ్ల స్థలాల లేఅవుట్ పనులు

హద్దురాళ్లు పాతుతున్న సిబ్బంది

మంగళగిరి: సీఆర్‌డీఏ పరిధిలో పేదలకు కేటాయించిన ఇళ్ల స్థలాల్లో లేఅవుట్ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. కృష్ణాయపాలెం, యర్రబాలెం, నవులూరు, నిడమర్రు పరిధిలలో సుమారు 20 వేల మంది పేదలకు ఇళ్ల పట్టాలు అందజేసేందుకు సీఆర్‌డీఏ సన్నాహాలు చేస్తోంది. ఇళ్ల స్థలాల కోసం కేటాయించిన భూముల్లో ఇప్పటికే పొదలు తొలగింపు, చదును పనులు పూర్తి చేస్తున్నారు. చదును పనులు పూర్తయిన భూముల్లో లేఅవుట్‌లు వేసి హద్దు రాళ్లు ఏర్పాటు చేస్తున్నారు. శనివారం కృష్ణాయపాలెం వద్ద పేదలకు కేటాయించిన ఇళ్ల స్థలాల్లో హద్దు రాళ్లు పాతే ప్రక్రియను చేపట్టారు. మరి కొద్ది రోజుల్లో ఇళ్ల పట్టాల పంపిణీకి ప్రభుత్వం సిద్ధం అవుతుండగా లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేసిన అధికారులు లబ్ధిదారుల పేరుతో పట్టాలు తయారు చేసే పనిలో నిమగ్నమయ్యారు. మరో వారం రోజుల్లో సీఆర్‌డీఏ పరిధిలో కేటాయించిన భూముల్లో ఇళ్ల స్థలాలకు హద్దురాళ్లు పాతి ప్లాట్ నంబర్లు కేటాయించేలా చర్యలు తీసుకుంటుండటంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కొద్ది రోజుల్లోనే తమ సొంతింటి కల నెరవేరనుండటంతో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.